క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేసరపల్లి, అప్పారావుపేట, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన శ్రావణమాస పూజలు



పెనమలూరు: యనమలకుదురులో శ్రావణ మాసం నెలరోజుల పాటు జరిగిన ప్రత్యేక పూజలు, చండీ హోమం పూజా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహా పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నెల రోజులపాటు జరిగిన చండీ హోమంలో పాల్గొన్న భక్తులకు ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు భక్తులకు స్వామివారి ఫొటో, ప్రసాదం ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యహణాధికారి ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం



పెనమలూరు: విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటాలని మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు అన్నారు. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఆయన ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనటం వల్ల మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం, ఒత్తిడిని తట్టుకునే శక్తి వస్తుందని చెప్పారు. 8 రకాల క్రీడలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చక్క గోపీకృష్ణ, హెచ్‌ఎం రఘురామ్, పీడీ సురేష్, అన్నవరపు వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురంలో ఆక్రమిత భూమి పరిశీలన

ఉయ్యూరు: మండలంలోని గండిగుంట శివారు ఆనందపురంలో 926 సర్వే నంబరులో ఆక్రమణలో ఉన్న భూములను కంకిపాడు ఇరిగేషన్ సెక్షన్ ఏఈ టి.వీరాంజనేయులు శుక్రవారం పరిశీలించారు. భూముల ఆక్రమణపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై స్పందనలో దరఖాస్తు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఈ వీరాంజనేయులు ఆక్రమణలో ఉన్న ఇరిగేషన్ భూములను పరిశీలించారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏఈ తెలిపారు.

రూ.25 వేల విలువైన పుస్తకాల వితరణ

గన్నవరంరూరల్: విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆకాంక్షించారు. శుక్రవారం ఆమె తన పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని 8 జెడ్పీ హైస్కూళ్లకు, వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల, మూడు గ్రంథాలయాలకు రూ.25వేల విలువ చేసే నీతి కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచి నైతిక విలువలను పెంపొందించుకోవాలని చెప్పారు. ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ చేదోడు' దరఖాస్తుల విచారణ

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 29వ తేదీన చేతి వృత్తుల వారికి వైఎస్సార్ చేదోడు పథకం కింద ఆర్థికసహాయం చేయనున్న నేపథ్యంలో దరఖాస్తులను గ్రామాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు విచారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది చేతివృత్తులను చేసుకొంటూ జీవనం గడుపుతున్న టైలర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు ప్రతి సంవత్సరం పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. అందుకు గాను ఈ ఏడాది విజయవాడ రూరల్ మండలం నుంచి ఆర్థిక సహాయం పొందడానికి 611 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారు దరఖాస్తులను విచారించిన పిమ్మట ప్రతిపాదనలు పంపుతారని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునేందుకు శనివారం తుది గడువని ఆయన తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాలు సిద్ధం




మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న కార్మికుడు



భక్తుల కోసం సిద్ధంగా ఉన్న మట్టి గణపతి విగ్రహాలు



మట్టి గణపతి విగ్రహం



మట్టి విగ్రహాలతో భూమిని కాపాడుదాం

పెనమలూరు: వినాయకచవితి సందర్భంగా భక్తుల కోసం పవిత్ర మట్టి గణపతి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. గంగూరు వద్ద మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి ప్రేమికులు మట్టి గణపతి విగ్రహాలతో వినాయక చవితి పండుగను ఘనంగా చేసుకోవాలని ముందుకు వస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించే భక్తులు పుష్కలంగా ఆశీస్సులు అందుతాయని ప్రగాఢ విశ్వాసం. గంగూరులోని మన గ్రామంలో రసాయన రంగులతో కాకుండా కేవలం మట్టితోనే చేసిన వినాయుడి ప్రతిమలు రూపొందించారు. కోల్‌కత్తా నుంచి వచ్చిన కళాకారులు మట్టి వినాయుడి బొమ్మలు ఆకర్షిణీయంగా రూపొందించారు. మట్టి వినాయకుడి విగ్రహాలు ఉపయోగించటం వలన పర్యవరణం పరిరక్షణే కాకుండా భూమిని కాపాడుకోవచ్చని నిర్వహకులు తెలిపారు. మన గ్రామంలో చేతి వృత్తులవారికి జీవనాధారం కల్పించటానికి కృషి చేస్తున్నారు. ఇక్కడ గంగానది మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహం కొన్నవారికి ఉచితంగా ఖాదీవస్త్రాలు, గో ఆధారిత బియ్యం 2 కేజీలు, గో ఆధారిత బెల్లం కిలో, జ్యూట్ బ్యాగ్ ఒకటి, వినాయకుడు గొడుగుగా తాటి గొడుకు ఇస్తారు. 5 అడుగులు ఉన్న మట్టి వినాయకుడి విగ్రహం రూ.12 వేలు, 3 అడుగుల విగ్రహం రూ.9 వేలు ధర ఉంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయకుడి విగ్రహాలతోనే ప్రకృతి ప్రేమికులు పూజలు చేసి భూమిని కాపాడాల్సిన బాధ్యత ఉంది.

మోక్షగుండం సేవలు మరువలేనివి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



కేకే శర్మను సత్కరిస్తున్న అధ్యాపకులు



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



క్విజ్ పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఇంజినీర్స్ డే ఘనంగా చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన ఫొటోకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య శాస్త్ర సాంకేతిక రంగాల్లో అందించిన సేవలు మరువలేనివని మేఘాలయ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ గ్రూప్ హెడ్ డాక్టర్ కేకే శర్మ అన్నారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన నాగసాయి ప్రెసిషన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ బి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ కోర్ ఇంజినీరింగ్ కోర్సులు చాలా కీలకమని వాటి పై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా కేకే శర్మ, నారాయణరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు: జాతీయ ఇంజినీర్స్‌డే వేడుకలు దావులూరు సచివాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సచివాలయ ప్రాంగణంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి కె.కూర్మారావు మాట్లాడుతూ దేశప్రగతిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పి.రవిచందు, డిజిటల్ అసిస్టెంట్ బి.కిషోర్‌బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ వలీబాబా, సర్వేయరు షేక్ ఆయిష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉషారామ'లో ఘనంగా ఇంజినీర్స్ డే

ఉంగుటూరు: విద్యార్థులు నేటి సమాజానికి అనుగుణంగా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని విజయవాడ బీఎస్‌ఎన్‌ఎల్ డివిజనల్ ఇంజినీర్ ఎస్.రామారావు అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీఎస్‌కేవీ ప్రసాద్, డైరెక్టర్ కుర్రా రాజశేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

'వికాస్'లో విశ్వేశ్వరయ్య జయంతి

నున్న(విజయవాడరూరల్): ప్రముఖ ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు శుక్రవారం నున్న గ్రామంలోని వికాస్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ విభాగం వారు సింటాక్స్ 23 అనే వార్షిక విజ్ఞాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితంలో సాధించిన విజయాలను వివరించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.రమణ, డాక్టర్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

రామవరప్పాడు: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ లెవల్ ఆన్‌లైన్ టెక్నికల్ క్విజ్ ఆన్ పైథాన్ నిర్వహించారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 310 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలకు చెందిన యోగేశ్వరరావు, ద్వితీయ బహుమతి సాధించిన అమృతసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి షేక్ ఖాజా మోహిద్దీన్, తృతీయ బహుమతి సాధించిన ఎస్సార్కే కళాశాలకు చెందిన స్రవంతిలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆశాలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

హలో మాల-చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

గన్నవరం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 20, 21 తేదీల్లో చేపట్టిన హలో మాల-చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోగుల మూడి రాజు పిలుపునిచ్చారు. స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం చలో ఢిల్లీ కరపత్రాన్ని సంఘ రాష్ట్ర కార్యదర్శి వర్రె చిట్టిబాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోమవరపు ప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని, సంఘ నేతలు సరిహద్దు ప్రవీణ్, మారుమూడి రాంబాబు, వై.సతీష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో నూతన పింఛన్ల పంపిణీ

గన్నవరంరూరల్: కొత్తగా పింఛన్లు మంజూరు చేసి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పండుగ వాతావరణం తెచ్చిందని కొత్తగూడెం సర్పంచ్ తూంపాటి రాంబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం లబ్ధిదారులకు మంజూరైన 15 పింఛన్లను ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గతో కలసి ఆయన పంపిణీ చేశారు. అర్హత ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసిన ఘనుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఉపసర్పంచ్ దేవరపల్లి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌రావు కుటుంబ సభ్యులకు పరామర్శ



పెనమలూరు: మాజీ సర్పంచ్ మరీదు మస్తాన్‌రావు కుటుంబ సభ్యులను డీసీఎంఎస్ చైర్ పర్సన్ పడమట స్నిగ్ధ శుక్రవారం పరామర్శించారు. మూడురోజుల క్రితం మస్తాన్‌రావు అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో స్నిగ్ధ గ్రామానికి వచ్చి మస్తాన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

పెనమలూరు: తల్లీ కుమార్తె అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌కు చెందిన వి.కోటేశ్వరరావు, కవిత చక్రవర్తి గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె తేజశ్వని ఉంది. భర్త సెల్‌ఫోన్ షోరూమ్‌లో పని చేస్తాడు. కాగా కవితచక్రవర్తి, ఆమె కుమార్తె తేజశ్వని ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వారి కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫార్మసీ రంగంలో నూతన పరిశోధనలపై సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ రంగంలో నూతన ఉత్పత్తులపై పరిశోధనలు, వ్యాపార అవకాశాలను విద్యార్థులకు తెలియజేసేందుకు శుక్రవారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు జరిగింది. బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్, పలు నూతన ఉత్పత్తులపై పరిశోధనా పత్రాలు సమర్పించి కొత్త పేటెంట్స్ సాధించిన డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలు, ప్రాచుర్యం పొందే విధంగా చేసేందుకు ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎ. సునీత, టీపీరావు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



త్రోబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న 67వ క్రీడా సమాఖ్య మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజున జరిగిన అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పది పాఠశాలలకు చెందిన 300 మంది బాల, బాలికలు హాజరయ్యారు. వీరికి రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలెన్‌త్రో, లాంగ్ జంప్, హై జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాల, బాలికలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండలం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు మండల క్రీడల సమన్వయకర్త దనియాల నాగరాజు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో పతకాలను బహూకరించారు.

జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగవంతం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మురళీ మోహన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు, గృహ విద్యుత్ కనెక్షన్ల కేటాయింపు చర్యలు త్వరితగతిన చేపట్టాలని ఏపీ సీపీడీసీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఈ ఎ.మురళీ మోహన్ ఆదేశించారు. స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నూజివీడు, గుడివాడ డివిజన్ విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీలోని లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా మంజూరు చేయాలని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే మార్పు చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయాలని ఎస్ఈ సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు నిమిత్తం వస్తున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, నిర్ణీత రుసుము చెల్లించిన రైతులకు తక్షణమే విద్యుత్ సదుపాయం అందించాలన్నారు. డీఈ హనుమయ్య, గుడివాడ, నూజివీడు డివిజన్ ఈఈ, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కాటూరు పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార సలహా మండలి సభ్యురాలు దేవి

ఉయ్యూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆహార సలహా మండలి సభ్యురాలు జి.దేవి అన్నారు. మండలంలోని కాటూరు పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాల, కలవపాములలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు సక్రమంగా అందుతుందీ? లేనిదీ ఆరా తీశారు. విద్యార్థులు, చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దేవి మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం సక్రమంగా అందుతుందని చెప్పారు. విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కాటూరు పీహెచ్‌సీలో రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీప, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు

కంకిపాడు: డ్రెయినేజీ నిర్మాణ పనులతో మురుగు సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని వక్తలు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలు అంచనా వ్యయంతో కోలవెన్ను గ్రామంలోని బీసీ ఏరియాలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. నేతలు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ సక్కా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, పీఏసీఎస్ ప్రతినిధి కంచర్ల శేషగిరి, రాం-లక్ష్మణ్, వార్డు సభ్యుడు గోవింద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం




పెదపులిపాకలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ విమాదేవి సూచించారు. మండలంలోని కాటూరు పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్షపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ విమాదేవి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలను నమోదు చేసుకుని వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దీప, డాక్టర్ అనిల్ రాకేష్, సర్పంచులు కొడాలి ఆశాజ్యోతి, పానుగుమాటి బాలస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: మండల పరిధిలో చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. పెదపులిపాక, గంగూరు గ్రామాల్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఈ నెల 30వ తేదీన మండల పరిధిలోని ఆరు గ్రామాలు, 11 గ్రామ సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సచివాలయాల సిబ్బంది, వలంటీర్‌లు గ్రామాల్లో ప్రతి ఇంట్లో సర్వే చేసి అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పద్మావతిదేవి, సుబ్బారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీన కానూరు 1 శివాలయం సెంటర్, అక్టోబర్ 3 వ తేదీ పోరంకి 1 సబ్‌సెంటర్‌లో, 4వ తేదీన కానూరు 2 షిరిడీనగర్, 5వ తేదీ పోరంకి 2 సచివాలయం, 6వ తేదీన కానూరు 3 సచివాలయం, 9వ తేదీన కానూరు 4 సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన కానూరు 5 సచివాలయం,13వ తేదీ పోరంకి 3వ సచివాలయం యాదవుల బజార్, 18వ తేదీన తాడిగడప1 సచివాలయం, 19వ తేదీన పోరంకి 4 సచివాలయం, 20వ తేదీన తాడిగడప 2 సచివాలయం, 21వ తేదీన ప్రభునగర్ సచివాలయం 5లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ తాడిగడప 3 సచివాలయం,26 వ తేదీ యనమలకుదురు సచివాలయం 1లో, 27వ తేదీ తాడిగడప 4 సచివాలయం లిమ్రాకాలనీలో, 28వ తేదీ యనమలకుదురు 2 సచివాలయం పవర్‌స్టేషన్ వద్ద, 31వ తేదీ యనమలకుదురు 3 సచివాలయం చౌడేశ్వరకాలనీ, నవంబర్ 2వ తేదీన యనమలకుదురు 4వ సచివాలయంలో, 4వ తేదీన ప్రియదర్శనినగర్‌లో 4వ సచివాలయంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

ఉంగుటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



ఉంగుటూరులో సర్వే పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ఉంగుటూరు: ప్రజలకు వచ్చే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్నారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలో చేపడుతున్న సర్వేని ఎంపీపీ, ఎంపీడీవో శేషగిరిరావుతో కలసి సర్వేను పరిశీలించారు. వలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాలలో వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ఏఎన్ఎం ద్వారా టోకెన్ కేటాయించాలని సూచించారు. అంగవైకల్యం, మానసిక రుగ్మతలు గుర్తించి వారిని క్యాంపునకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.